ఉష్ణోగ్రతలు | గరిష్ఠం: 34.0 | కనిష్ఠం: 24.0





మహబూబ్‌నగర్ మోడ్రన్ హైస్కూల్ కేంద్రం నుంచి పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థులు

కొరవడిన నిఘా



- ఆహ్లాదం కోసం వచ్చే ప్రాంతాల్లోనూ అసాంఘిక కార్యకలాపాలు
- సీసీ కెమెరాల నిఘా అంతంతే.. పెట్రోలింగ్ మృగ్యం
- ఆ ప్రదేశాలకు వెళ్తున్న ప్రేమ జంటలే ఆకతాయిలకు టార్గెట్
- జన సంచారం తక్కువ ఉన్న ప్రాంతాలు తాగుబోతులకు అడ్డా
- అక్కడే గంజాయి సేవనం.. మద్యం సిట్టింగులు.. జోరుగా పేకాట
- ఆకతాయిలు బెదిరించి వేధిస్తున్నా.. పరువు కోసం ఫిర్యాదు కరవు



వనపర్తి జిల్లా రేవల్లి మండలం తల్పునూరు ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో వేసిన మద్యం సీసాలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆహ్లాదం, ఆధ్యాత్మికతను పంచే ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు వేదికలుగా మారుతున్నాయి. తాగిన మైకంలో ఘర్షణలు, హత్యలు, అత్యాచారాలు, లైగింక వేధింపులు, బెదిరింపులకు కేంద్రాలవుతున్నాయి. కొరవడిన నిఘా నేత్రాలు, పెట్రోలింగ్ బృందాల గస్తీ లేని కారణంగా ఆకతాయిలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. తాజాగా ఉర్కొండపేటలో మహిళపై జరిగిన అత్యాచార ఉదంతం పలు ప్రాంతాల్లో కలకలం రేపుతోంది. తమ ప్రాంతాల్లో కూడా ఆకతాయిల ఆగడాలు మితిమీరుతున్నాయని కొందరు బాహాటంగానే చెబుతున్నారు. పెరుగుతున్న టెక్నాలజీ ప్రభావం, అందుబాటులో ఉంటున్న మత్తు పదార్థాల వినియోగం రోజురోజుకూ పెరుగుతుండటంతో యువత గాడి తప్పుతోంది. మహిళపై అత్యాచార ఘటనలో నిందితులుగా రిమాండ్‌కు పంపిన వారంతా యువకులే కావడం ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. ఈ విషయమై పోలీసులకు పలువురు సమాచారం అందిస్తున్నా, పలు జిల్లాల్లో పట్టింపు లేకుండా పోయింది. ప్రధానంగా ఆహ్లాద ప్రాంతాలకు వస్తున్న వారు మేజర్లు కావడం, వారిని ప్రశ్నించే అధికారం లేకపోవడం, సున్నితమైన అంశం కావడంతో మందలించలేకపోవడం అధికారుల నిస్సహాయతగా మారుతోంది. ఇదే అదునుగా పోకిరి మూకలు చెలరేగుతున్నాయి. ఊర్కొండపేట ఘటనలో పట్టుబడ్డ నిందితులు రోజూ ఇదే తరహాలో వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. ఈ ఆకతాయిలకు అడ్డుకట్ట పడకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతం అయ్యే ప్రమాదం లేకపోలేదు.

ప్రేమ జంటలే టార్గెట్..

ఉమ్మడి పాలమూరు ప్రతీ జిల్లా కేంద్రం సమీపంలో ప్రజలు కాసేపు ఆహ్లాదంగా గడపటం కోసం ఎకో పార్కులను ఏర్పాటు చేశారు. అక్కడికి ఉదయం వేళల్లో వాకర్స్ వస్తుండగా, సాయంత్రం వేళల్లో ఫ్యామిలీస్ వస్తున్నాయి. ఇక కాలేజీ సమయం ప్రారంభమైన తర్వాత నుంచి ప్రేమ జంటలకు పార్కులు ఆవాసాలుగా మారాయి. ఆ సమయాల్లో అటు వెళ్లాలంటే మిగతావారు జంకుతున్న పరిస్థితి ఉంది. మరి ఆ పార్కులు మొత్తం సీసీ కెమెరాల నిఘా ఉందా? అంటే అదీ లేదు. కేవలం ఎంట్రెన్స్‌ల వద్ద మాత్రమే ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ఎవరూ రారనే

(మిగతా 6లో..)

ముగిసిన పది పరీక్షలు

- ఇంటి బాట పట్టిన విద్యార్థులు
- మహబూబ్‌నగర్ జిల్లాలో 99.71 శాతం హాజరు



ఆటోలో ఇళ్లకు వెళుతున్న విద్యార్థినులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. దాంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. గత నెల 21 నుంచి పరీక్షలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 60 కేంద్రాల్లో పరీక్షలను పటిష్ట బందోబస్తు మధ్య నిర్వహించారు. కేంద్రాలను కలెక్టర్ విజయేందరబోయి, ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్, డీఈవోలు పరిశీలించారు. చివరి రోజు బుధవారం సాంఘిక శాస్త్రం పరీక్ష జరిగింది. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఒకరికొకరు పరీక్ష ఎలా రాశావని ఆరా తీశారు. వచ్చే విద్యా సంవత్సరం ఏ కళాశాలలో చేరతావంటూ ముచ్చటించుకున్నారు. ఏడాది పాటు వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి బ్యాగులు, పెట్టెలు సర్దుకుని ఆనందంగా ఇళ్లకు వెళ్లారు.



పరీక్షలు పూర్తయిన ఆనందంలో విద్యార్థినులు

99.71 శాతం హాజరు

చివరి రోజు సాంఘిక శాస్త్రం పరీక్షకు 99.71 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. 12,776 మందికి గాను 12,739 మంది హాజరుకాగా, 37 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 12,769 మంది ఉండగా.. 12,736 మంది హాజరుకాగా.. 33 మంది, ప్రైవేట్ విద్యార్థులు ఏడు మందికి గాను ముగ్గురు హాజరుకాగా.. నలుగురు గైర్హాజరు అయ్యారు. కేంద్రాలను ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అదనపు ఎస్పీ, డీఈవో తదితరులు పరిశీలించారు.

నారాయణపేటలో 18 మంది గైర్హాజరు

నారాయణపేట: నారాయణపేట జిల్లాలో చివరి రోజు సాంఘిక శాస్త్రం పరీక్షకు 18 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. జిల్లా వ్యాప్తంగా 39 కేంద్రాలను ఏర్పాటు చేయగా, 7,635 మంది విద్యార్థులకు గాను 7,617 మంది హాజరయ్యారు. ప్రైవేటుకు సంబంధించి నలుగురికి గాను ఇద్దరు హాజరు కాగా, ఇద్దరు గైర్హాజరు అయ్యారు. రాష్ట్ర పరిశీలకులు దుర్గప్రసాద్ మరికల్ గురుకుల, కృష్ణ జడ్పీహెచ్‌ఎస్, పులిమామిడి కస్తూర్బా, ఊట్కూర్ జడ్పీహెచ్‌ఎస్ బాలుర, మక్తల్ బాలుర, బాలికల పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. డీఈవో గోవింద్‌రాజులు ఐదు కేంద్రాలను పరిశీలించారు. ఒకేషనల్ చివరి పరీక్ష గురువారం జరుగనుంది.

కేంద్రం రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోంది

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ విషయాన్ని దేశ ప్రజలకు వివరించేందుకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకులు రాహుల్‌గాంధీ పిలుపు మేరకు పార్టీ ఆధ్వర్యంలో జైబాపు.. జైభీమ్.. జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాత పాలమూరు అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎమ్మెల్యే యెన్నం పాదయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైనారిటీలు రక్షణ కోల్పోతున్నారన్నారు. అనేక సందర్భాలలో రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించి కేంద్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను తేవాలని చూస్తోందని విమర్శించారు. వాటన్నింటిపై ప్రజలను చైతన్య పరిచి, రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత దేశంలోని ప్రతీ వ్యక్తిపై ఉన్నదన్నారు. అందుకే ప్రజలను జాగృతం చేసేందుకు కాంగ్రెస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రతీ వార్డు, గ్రామం, వీధి, ఇంటికి ఈ కార్యక్రమాన్ని తీసుకెళ్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఈ బాధ్యతను తీసుకుంటారన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నగరంలోని 11, 25 వార్డులలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు జహీర్‌అక్తర్, చంద్రకుమార్‌గౌడ్, ఎన్పీ వెంకటేశ్, సిరాజ్‌ఖాద్రి, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, సీజే బెనహర్ పాల్గొన్నారు.

- మహబుబ్‌నగర్ రూరల్: మండలంలోని మన్యంకొండ అలివేలు మంగమ్మదేవస్థాన ఆవరణ నుంచి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం జై బాపు జైభీమ్ జైసంవిధాన్ పాదయాత్రను ప్రారంభించారు. అప్పాయిపల్లి, కోడూరు చౌరస్తా వరకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నాయకులతో కలిసి 4 కిలో మీటర్ల మేర పాదయాత్ర చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నదని, ఇది మానవ హక్కులను హరించే కుట్ర అని అన్నారు.



జైబాపు జైభీమ్ జైసంవిధాన్ పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

జగ్జీవన్ రామ్, అంబేడ్కర్.. జయంతి ఉత్సవాలకు సహకరించాలి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న నిర్వహించనున్న బాబు జగ్జీవన్ రామ్ జయంతి, 14న నిర్వహించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలకు అందరూ సహకరించాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి కోరారు. ఈ విషయమై కలెక్టర్ బుధవారం తన కార్యాలయ మినీ సమావేశ మందిరంలో సంబంధిత సంఘాల ప్రతినిధులు, అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం మరింత ఘనంగా ఉత్సవాలు నిర్వహించేందుకు సంఘాల నాయకులు, ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలను అందిస్తామని చెప్పారు. సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణతో పాటు, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, అంబేడ్కర్ విగ్రహాల పరిరక్షణ ఇతర సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం అంబేడ్కర్ కళాభవన్‌లో సమావేశం ఏర్పాటు చేసి, భోజనాలు ఏర్పాటు చేయాలని, జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద మెట్లను నిర్మించాలని కోరారు. సమావేశానికి జిల్లా పరిషత్ సీఈవో వెంకట్ రెడ్డి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సుదర్శన్, కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు

- సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అర్హులైన అన్ని పేద కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డులు అందుతాయని ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నియోజకవర్గంలోని దేవరకద్ర, కౌకుంట్ల మండలాల్లో రేషన్ దుకాణాల నుంచి సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ పేదవాడు పండుగ రోజే కాదు ప్రతీ రోజూ సన్న బియ్యం తినాలని ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. సన్న బియ్యం పంపిణీ నిపేదలకు ఒక వరం లాంటిదన్నారు. సన్న బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం ఎంతో ఖర్చుపెట్టి ఈ బియ్యాన్ని పంపిణీ చేస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం మాటలకే పరిమితమని, ఏ పనీ చేయలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు బోనస్ ఇచ్చి, రైతుకు అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, మార్కెట్ చైర్మన్ కథలప్ప, పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఫారుఖ్ అలీ తదితరులు పాల్గొన్నారు.



దేవరకద్రలోని ఓ రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

చరిత్రలో నిలిచిపోతుంది

చిన్నచింతకుంట: రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందని దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నెల్లికొండి గ్రామంలో ఆయన సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. డీలర్లు పారదర్శకతతో పని చేయాలన్నారు. వారి సమస్యలు త్వరలో పరిష్కారం అయ్యే అవకాశం ఉందన్నారు. యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాలమూరులో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయండి

- కేంద్రమంత్రి కుమారస్వామికి శ్రీనివాస్‌గౌడ్ వినతి

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పాలమూరులో సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, సురేశ్‌కుమార్‌రెడ్డి, దామోదర్‌రావుతో కలిసి బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించారు. మహబూబ్‌నగర్‌లో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీకి అవసరమైన సున్నపు రాయి, లాటరైట్ రాయి వంటి ముడి పదార్థాలతో పాటు స్కిల్ వర్కర్లు అందుబాటులో ఉన్నారనిచెప్పారు. హైదరాబాద్, రాయచూర్, గుల్బర్గా వంటి ఐటీకారిడార్ ప్రాంతాలు దగ్గరలో ఉన్నాయన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు ద్వారా ఈప్రాంత అభివృద్ధితోపాటు ఉపాధి లభిస్తుందని, ప్రజల ఆర్థిక స్థితి మెరుగుపడేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. సీసీఐ(సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా కొత్త సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రికి శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు.

ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పొడిగింపు

మహబూబ్‌నగర్,ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్(లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) చెల్లింపుదారులకు రాయితీ గడువును ప్రభుత్వం ఈనెల 30 వరకు పొడిగిస్తూ మరో అవకాశం ఇచ్చింది. 2020లో దరఖాస్తు చేసుకున్నవారికి అప్పటి మార్కెట్ విలువ ప్రకారం 25 శాతం రాయితీతో చెల్లింపులు చేసుకునేందుకు గతంలో మార్చి 31 వరకు అవకాశం కల్పించింది. ఆ గడువు ముగియడంతో తేదీని పొగడిస్తుందని భావించినా అలాంటి ప్రకటన రాకపోవడంతో చాలామంది నిరుత్సాహానికి గురయ్యారు. తాజాగా ఈనెల 30 వరకు గడువు పొడిగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేయడంతో ఫీజు చెల్లించలేని దరఖాస్తుదారులకు నెల రోజుల సమయం లభించింది. చాలామంది అవగాహన లేక, డబ్బు సర్దుబాటు కాక ఫీజు చెల్లించలేకపోయారు. అవకాశం ఇవ్వడంతో మరింత మంది ముందుకు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వానికి ఆదాయం కూడా సమకూరనుంది.

ఆస్తి పన్ను అడ్వాన్స్ చెల్లింపులపై 5 శాతం రిబేట్

2025-26 సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను అడ్వాన్స్‌గా చెల్లిస్తే మొత్తం పన్నులో 5 శాతం రిబేట్ ఇవ్వనున్నారు. ఈనెల 30లోగా పన్ను మొత్తం చెల్లింపులు చేసిన వారికి ఇది వర్తించనుంది.

'పేట'లో రూ.9.54 కోట్ల ఆదాయం

నారాయణపేట: ఎల్ఆర్ఎస్ కింద నారాయణపేట జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల నుంచి 2020లో 22,881 దరఖాస్తులను స్వీకరించారు. వాటిలో మార్చిలో 15,107 ఆమోదం పొందాయి. ప్రభుత్వం 25 శాతం రాయితీ కల్పించడంతో 2,967 దరఖాస్తుదారులు రూ.9 కోట్లా 54 లక్షలా 95 వేలు ఫీజు చెల్లించారు. ఆమోదం పొంది ఫీజు చెల్లించని దరఖాస్తులకు సంబంధించి ఇంకా కోటీ 21 లక్షలా 40 వేలు చెల్లించాల్సి ఉంది. గడువు పొడిగించడంతో వారికి ఉపశమనం లభించింది.

కొత్తకోటలో 39.3 డిగ్రీల ఉష్ణోగ్రత

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఎండ తీవ్రత కాస్త తగ్గింది. రెండు రోజుల నుంచి వాతావరణం చల్లబడింది. రాత్రి వేళలో చల్లటి గాలులు వీస్తున్నాయి. బుధవారం వనపర్తి జిల్లా కొత్తకోటలో 39.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అత్యల్పంగా అమరచింత మండలంలో 21.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠంగా 35.9, కనిష్ఠంగా 24, నారాయణపేట జిల్లాలో గరిష్ఠంగా 34, కనిష్ఠంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠం 34, కనిష్ఠం 24 డిగ్రీలు నమోదైంది.

ఇసుక నిల్వల పరిశీలన

మిడ్జిల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని వెలుగొమ్ములలో ఇసుక నిల్వలను బుధవారం మైన్స్ టెక్నికల్ అసిస్టెంట్ సుజాత, తహసీల్దార్ రాజు, ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు పరిశీలించారు. సీసీ రోడ్డు నిమిత్తం ఇసుకను అక్కడ పోశారని, నిల్వలకు సంబంధించిన ప్రభుత్వ పని అధికారిక పేపర్లను తాము చూశామని తహసీల్దార్ తెలిపారు.

నిందితుల వాహనాలు సీజ్?

ఊర్కొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట అత్యాచార ఘటన నిందితుల వాహనాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. పోలీసులు బుధవారం తెల్లవారుజామున ఊర్కొండపేటలోని నిందితుల స్వగృహాలకు చేరుకొని మారుపాకుల ఆంజనేయులుగౌడ్‌కు చెందిన ఆటో, బైకుతో పాటు హరీశ్‌గౌడ్, మహేశ్ గౌడ్, మణికంఠకు సంబంధించిన బైకులు తీసుకెళ్లారు.

స్కూటీ అదుపు తప్పి ముగ్గురికి గాయాలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : స్కూటీ అదుపు తప్పి ముగ్గురు బాలురకి గాయాలయ్యాయి. పట్టణంలోని మోతీనగర్‌లో ఉన్న ఎస్టీ బాలుర హాస్టల్ వాచ్‌మన్ కుమారుడు తండ్రి స్కూటీ తీసుకుని ఇద్దరు స్నేహితులతో కలిసి బయటకు వెళ్లారు. కొద్దిదూరం వెళ్లగానే మోతీనగర్ రైస్‌మిల్లు వద్ద స్కూటీ అదుపు తప్పడంతో ముగ్గురూ పడిపోయారు. ఇందులో ఒక విద్యార్థికి కాలు విరగగా, మిగతావారికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం జనరల్ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక వ్యాపారిపై కేసు నమోదు

మూసాపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోబోయిన పోలీసులపై దౌర్జన్యానికి పాల్పడిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లిలో గత నెల 28న చోటు చేసుకుంది. ఎస్‌ఐ ముల్కలపల్లి వేణు తెలిపిన వివరాల ప్రకారం.. కొమిరెడ్డిపల్లికి చెందిన ఇసుక వ్యాపారి మామిళ్ల విజయకుమార్ తన మినీ డీసీఎంలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా గమనించిన పోలీసు కానిస్టేబుల్స్ అడ్డుకోబోయారు. ఎలాగైన తప్పించుకోవడం కోసం పోలీసు సిబ్బంది పెట్రోలింగ్ వాహనంపైకి దూసుకొచ్చి ఢీకొట్టడంతో ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి. దీనిపై విచారించి మామిళ్ల విజయకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. బుధవారం మామిళ్ల విజయకుమార్‌ను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ర్యాగింగ్‌కు పాల్పడిన వైద్య విద్యార్థుల సస్పెన్షన్

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడిన ముగ్గురు వైద్య విద్యార్థులపై సస్పెన్షన్ విధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి బుధవారం తెలిపారు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిపై ర్యాగింగ్‌కు పాల్పడిన వారితో సమావేశం నిర్వహించి విద్యార్థి లోకేష్‌కు మూడు నెలలు, హర్షవర్ధన్‌కు రెండు నెలలు, హేమవర్ధన్‌కు నెలరోజుల పాటు సస్పెన్షన్ విధించినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని ప్రిన్సిపాల్ సూచించారు. అసభ్యంగా ప్రవర్తించిన వ్యవహరించిన ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


నవీన్ (ఫైల్)

గద్వాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపురం గ్రామంలో విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటోనిపల్లి గ్రామానికి చెందిన నవీన్(35) మేస్త్రీ కింద పనిచేయడానికి వీరాపురం గ్రామ సమీపంలో నిర్మాణ పనులకు వెళ్లాడు. అక్కడ ఓ ప్రైవేట్ పాఠశాల ద్వారా నిర్మాణ పనులకు ఇనుప పైపులతో అట్టడి వేస్తున్నారు. ఈ క్రమంలో పైపు పైకి ఎత్తుతుండగా అదుపు తప్పి ఒరిగి పక్కనే ఉన్న హెచ్‌టీ విద్యుత్‌వైర్లకు తగిలింది. షాక్‌కు గురై నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య జయశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూగర్భజలాలను కాపాడాలి

వంగూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దుందుభీ నది వాగు పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాను నియంత్రించి భూగర్భజలాలను కాపాడాలని నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని జాజాల గ్రామ రైతులు కోరుతున్నారు. పోతారెడ్డిపల్లి శివారులో వాగు సమీపంలో ఓ రైతు పొలంలో ఇసుకను తీసేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఆ ప్రాంతాన్ని రైతులు బుధవారం సందర్శించారు. టిప్పర్లలో ఇసుక భారీగా తరలిపోయే అవకాశం ఉందని దీంతో భూగర్భ జలాలు అడుగంటి పోయి, వ్యవసాయ బోర్లలో నీరు లేక ఎండిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. వెంటనే కలెక్టర్ స్పందించి ఇసుక అనుమతులను రద్దు చేయాలని రైతులు కోరారు.

పూలే విగ్రహావిష్కరణపై సమీక్ష


బిజినేపల్లిలో అభివాదం చేస్తున్న పలు సంఘాల నాయకులు

బిజినేపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో 9న జ్యోతిరావుపూలే జయంతి పురస్కరించుకొని విగ్రహావిష్కరణ చేపట్టేందుకు కార్యచరణపై సమీక్ష నిర్వహించినట్లు విగ్ర హావిష్కరణ కమిటీ అధ్యక్షుడు అంతటి రాజేందర్ గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు మాట్లాడుతూ దాదాపు 20వేల మంది హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం పలువురికి కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. కార్యక్రమంలో మంగి విజయ్, గంగన మోని కిరణ్, పీఏసీఎస్ చైర్మన్ బాల్‌రాజు గౌడ్, వెంకటస్వామి, భగవంత్‌గౌడ్, సత్యశీల సాగర్, బంగారి పర్వతాలు, గంగనమోని తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం.. సంతోషం


నారాయణపేటలో రేషన్ దుకాణం వద్ద బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు

రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో దొడ్డు బియ్యం తినేందుకు ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు పంపిణీ చేసిన బియ్యంతో చేసిన అన్నం బాగుందని చెబుతున్నారు. పండుగలకు మాత్రమే సన్న బియ్యం కొని వండుకునేవారమని, ప్రతీ నెల సన్నబియ్యం పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందని లబ్ధిదారులు అంటున్నారు.

- మహబూబ్‌నగర్ న్యూటౌన్/ దేవరకద్ర/ గద్వాల న్యూటౌన్, మక్తల్, ఖిల్లాఘణపురం/నవాబ్‌పేట (ఆంధ్రజ్యోతి)

అన్నం మంచిగ అయ్యింది



ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యం అన్నం మంచిగ అయ్యింది. బియ్యంలో నూకలు లేకుండా, పాలిష్ తక్కువగా ఉంది. షాపులలో కొనుగోలు చేసిన బియ్యం మాదిరిగానే ఉన్నాయి. ప్రభుత్వం ప్రతినెల రేషన్‌షాపుల ద్వారా ఈ బియ్యాన్నే సరఫరా చేయాలి. ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేయడం ఎంతో సంతోషకరం.

- అరుణ, మోనప్పగుట్ట, మహబూబ్‌నగర్

సంతోషకరం



ప్రభుత్వం రేషన్ దుకాణాలలో అందించే రేషన్ బియ్యం బాగున్నాయి. పాత హౌసింగ్‌బోర్డు కాలనీలోని రేషన్ దుకాణంలో సన్నబియ్యం తీసుకున్నాను. బియ్యాన్ని వండగా అన్నం బాగుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదప్రజలకు సన్నబియ్యాన్ని అందించడం సంతోషంగా ఉంది.

- సుజాత, పాత హౌసింగ్‌బోర్డు కాలనీ, గద్వాల

సన్నబియ్యం బువ్వ బాగుంది



ప్రభుత్వం ఇచ్చిన సన్నబియ్యంతో వండిన బువ్వ బాగుంది. దొడ్డు బియ్యంతో అన్నం తినాలంటే ఇబ్బందిగా ఉండేది. సన్నబియ్యం కొనాలంటే మస్తు పైసలు అయ్యేవి. ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేయడం సంతోషంగా ఉంది. ఆ బియ్యం వండుకుని తింటున్నాము.

- సరోజ, యన్మన్‌గండ్ల నవాబ్‌పేట


సింగారంలో బియ్యం తీసుకునేందుకు వేలిముద్ర వేస్తున్న మహిళ

దొడ్డు బియ్యం తినాలంటే ఇబ్బంది



ప్రభుత్వం అందించిన సన్నబియ్యం చాలా బాగున్నాయి. ఇంతకంటే ముందు దొడ్డు బియ్యం ఉండేది. తినడానికి కొంచం ఇబ్బందిగా ఉండేది. సర్కారు వారు ఇచ్చిన సన్న బియ్యం వండినా. మాది బీద కుటుంబం.. ఎన్నడూ సన్నబియ్యం తినలేదు. నాకు 24కిలోల బియ్యం ఇచ్చారు. సన్నబియ్యం ఇస్తారని అనుకోలేదు.

- గడ్డం వెంకటమ్మ, భూత్పూర్

ప్రతీ నెల ఇవ్వాలి



ప్రభుత్వం అందించిన సన్నబియ్యం పేదలకు ఎంతోమేలు చేసేలా ఉన్నాయి. గతంలో దొడ్డుబియ్యం తినలేక చాలా ఇబ్బంది పడ్డాం. ప్రస్తుతం ప్రభుత్వం అందించిన సన్న బియ్యం వండుకొని కుటుంబ సభ్యులందరం భోజనం చేశాము. ప్రతీ నెలా క్రమం తప్పకుండా సన్నబియ్యం పంపిణీ కొనసాగించాలి.

- మంజుల, రెడ్డినగర్, మక్తల్

సన్న బియ్యం పంపిణీ సంతోషకరం



చౌకధర దుకాణాల్లో పంపిణీ చేసిన సన్న బియ్యం నాణ్యతగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో కొన్ని నెలలు సన్న బియ్యం ఇచ్చి మళ్లీ దొడ్డు బియ్యం ఇచ్చారు. రేషన్ కార్డుదారులు దొడ్డు బియ్యం ఇస్తే విక్రయించి సన్న బియ్యం తెచ్చుకుంటున్నారు. ప్రతి నెల నాణ్యమైన సన్న బియ్యాన్ని అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

- కందూరి సూర్యకళ, ఖిల్లాఘణపురం

వేసవిలో ఉపశమనం

- తాటి ముంజల విక్రయాల జోరు
- గ్రామీణులకు జీవనోపాధి


అయిజలో తాటిముంజలు కుప్పలుగా పోసి అమ్ముతున్న మేడికొండ గ్రామస్థులు

అయిజ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాటి ముంజల డిమాండ్ అంతాఇంతా కాదు. ఇవి శరీరానికి చలువనందిస్తాయని తెలిసిందే. వేసవిలో ఇవి విరివిగా ఎలాంటి పెట్టుబడి, కల్తీ లేకుండా తాటి చెట్టు నుంచి లభిస్తాయి. ప్రకృతిలో లభించే వీటితో గ్రామీణులు ఉపాధి పొందుతున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణానికి మేడికొండ, మాన్‌దొడ్డి, భూమ్‌పూర్, ఎక్లాస్‌పూర్ గ్రామాల నుంచి గంపలు, ఆటోలలో తాటి కాయలు, ముంజలు తరలించి విక్రయిస్తున్నారు. దాదాపు 450 నుండి 500 గల తాటి ముంజలు కలిగిన గంపలు రూ. 900కు, డజను రూ. 50కు అమ్ముతున్నారు. వీటిని పట్టణంలో అమ్మటంతో స్థానిక మహిళా వ్యాపారులు ఉపాధి పొందుతున్నారు. మరికొంత మంది తాటికాయలను నేరుగా పట్టణానికి ఆటోలో తరలించి అక్కడికక్కడే వేరుచేసి విక్రయిస్తున్నారు.

పదేళ్లుగా అమ్ముతున్నా..



అన్ని కాలాల్లో లభించే పండ్లను అమ్మి జీవనోపాధి పొందుతున్నాను. ఎక్కువగా తాటిముంజలు అ మ్ముతాం. గ్రామీణ వ్యాపారస్థుల నుంచి గంపను కొని డజను లెక్కను పట్టణంలో విక్రయిస్తాం. పదేళ్లుగా తాటి ముంజల అమ్మకాలే చేస్తున్నాను. వేకువజామునే గ్రామాల నుంచి అయిజకు తెచ్చిన ముంజలను కొని వీధుల్లో తిరిగి అమ్ముతాను.

- సవారమ్మ, అయిజ


ఆటోలో తాటిముంజలను అమ్ముతున్న ఉప్పల మహేష్

బీడీ కార్మికుల స్థలాలు అన్యాక్రాంతం

- 150 మందికి పట్టాలిచ్చిన ప్రభుత్వం
- ఇళ్ల మంజూరులో నిర్లక్ష్యం
- డంపింగ్ యార్డుగా మార్చిన మునిసిపల్


బీడీ కార్మికుల కేటాయించిన ఇళ్ల స్థలాల్లో పేరుకుపోయిన చెత్త

కొత్తకోట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీడీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని బాధితులు వాపోతున్నారు. 1995లో ప్రభుత్వం వడ్డెవాట రోడ్డు బ్రహ్మంగారి దేవాలయ సమీపంలో గల గుట్టలను 150 మంది కార్మికులకు స్థలాలు కేటాయించింది. దీంతో తమకు ఇంటి నిర్మాణానికి నిధులు కావడమే ఆలస్యమని వేచి చూశారు. కానీ అందరికీ ఒకేసారి నిధులు మంజూరు చేయడం భారం కావడంతో వాయిదా పడుతూ వచ్చింది. అనంతరం ప్రభుత్వాలు మారడంతో కాగితాలు చేతిలో ఉన్న ఇంటికి యజమాని కాలేకపోయామని దిగులుగా ఉన్నారు. ఈ ప్లాట్లు సైతం అన్యాక్రాంతం అయ్యావని తెలుసుకున్న కార్మికులు లబోదిబోమంటున్నారు.

డంపింగ్ యార్డుగా వినియోగం

ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో నిర్మానుష్యంగా మారింది. దీంతో మునిసిపల్ అధికారులు డంపింగ్ యార్డు కోసం వినియోగించుకుంటున్నారు. పట్టణంలోని చెత్తను గట్టుల్లోని డంపింగ్ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న బీడీ కార్మికులు, సంఘం నాయకులు డంపింగ్ యార్డును తొలగించి, స్థలాల హద్దులు చూపించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, వినతిపత్రం అందజేశారు.

డంపింగ్ యార్డు తొలగించాలి



బీడీ కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వంతో కొట్లాడి 150 మందికి ఇళ్ల స్థలాలు ఇప్పించాం. నిర్మాణాలకు నిధుల మంజూరు కోసం ప్రయత్నం చేస్తున్నాం. కార్మికులకు ఇచ్చిన స్థలంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం తగదు. వెంటనే చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి.

-మిషేక్, బీడీ కార్మిక సంఘం నాయకుడు

మా దృష్టికి వచ్చింది



నేను కమిషనర్‌గా ఇటీవల కాలంలోనే బాధ్యతలు తీసుకున్నా. కార్మికుల ఇంటి స్థలాల్లో డంపింగ్ యార్డు విషయం నా దృష్టికి వచ్చింది. ఈ విషయం జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేశా. అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాక డంపింగ్ యార్డుపై నిర్ణయం తీసుకుంటాం.

- సైదయ్య, మునిసిపల్ కమిషనరు

కాలుష్య కంపెనీల కోసం పర్యావరణాన్ని బలిపెడతారా?

- పాలమూరు అధ్యయన వేదిక

పాలమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కాలుష్య కంపెనీల కోసం పర్యావరణాన్ని బలిపెడుతున్నారని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ యం.రాఘవాచారి బుధవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌సీయూ భూములను ప్రభుత్వం దురాక్రమించడాన్ని ఖండించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 1973లో ఇందిరాగాంధీ ఆరు సూత్రాల పథకంలోని రెండో అంశాన్ని అమలు పరుస్తూ, అంతర్జాతీయ స్థాయిని తట్టుకునే విధంగా 2,300 ఎకరాల భూమిని కేటాయించి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పేరుతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయం దేశ నిర్మాణానికి అందించిన సామాజిక, వైజ్ఞానిక శాస్త్రవేత్తలు అందిస్తున్న దోహదాన్ని మరిచి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హెచ్‌సీయూ భూముల దురాక్రమణకు సిద్ధపడి అక్కడి పర్యావరణ, జీవా వరణ వ్యవస్థను బుల్‌డోజర్లతో ధ్వంసం చేస్తున్నట్లు తెలిపారు. ఈ విధ్వంసాన్ని, భూ దురాక్రమణను మానుకుని హెచ్‌సీయూ భూములను వదిలేయాలనిడి మాండ్ చేశారు. ప్రజలు బీజేపీ, బీఆర్‌ఎస్ పాలనతో విసిగిపోయి కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే అవే విధానాలు అమలు చేస్తే ఏమనాలని ప్రశ్నించారు. ఉస్మానియా యూనివర్సిటీలో ప్రజాస్వామ్యం కోసం, హెచ్‌సీయూలో పర్యావరణాన్ని ఆ యూనివర్సిటీ భూములను కాపాడటానికి పోరాడుతున్న విద్యార్థులకు మద్దతుగా ప్రజాస్వామిక వాదులు నిలబడాలని పిలుపునిచ్చారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ క్రైం డీఎస్పీ గిరికుమార్


అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ గిరికుమార్ కల్కోట

వెల్దండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సైబర్ క్రైం నేరాలపై ప్రతీతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ గిరికుమార్ కల్కోట సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సైబర్ క్రైంపై విద్యార్థులకు, యువకులకు, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. బెట్టింగ్ ఫ్రాడ్స్, ఐపీఎల్ టికెట్ ఫ్రాడ్స్ ఇతర వాటిపై అవగాహన కల్పించారు. బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారం ఎవరికీ ఇవ్వరాదని అన్నారు. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ కురుమూర్తి,పీఏసీఎస్ డైరెక్టర్లు సంజీవ్‌కుమార్, మట్ట వెంకటయ్య గౌడ్, హెచ్‌ఎం సుగుణ ఉన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

చారకొండ : సైబర్ నేరాల బారిన పడకుం డా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ శంషోద్దీన్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ పోలీసింగ్, సైబర్ నేరాలపై ఎస్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం మం డంలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి అవ గాహన కల్పించాలరు. వ్యక్తిగత, బ్యాంకు, ఆధార్‌కార్డు, ఓటీపీ తదితర వివరాలను అడిగితే చెపొద్దని అన్నారు. హెడ్‌కానిస్టేబుల్ నాగయ్య, శేఖర్, జంగయ్య, సరిత తదితరులు పాల్గొన్నారు.

కొరవడిన నిఘా

(5వ పేజీ తరువాయి..)

కుంటిసాకులు పరోక్షంగా చెబుతున్నారు. అక్కడికేదో ప్రేమ జంటల కోసమే ఆ పార్కులు ఏర్పాటు చేసినట్లు.

● వనపర్తి జిల్లాలో ఎకో పార్కు కూడా ప్రేమ జంటలకు ఆవాసంగా మారింది. పూర్తిగా చెట్లతో కమ్ముకుని ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు వేదిక అవుతోంది. జిల్లా కేంద్రంలోనే ఈ పార్కు ఉన్నా.. ఇప్పటి వరకు పెట్రోలింగ్ కూడా చేయడం లేదు. తిరుమలయ్య గుట్ట సమీప అటవీ ప్రాంతం కూడా గతంలో నుంచి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గతంలో ప్రేమ జంటలను బెదిరించి.. డబ్బులు దోచుకెళ్లిన ఘటనలు కూడా ఇక్కడ జరిగాయి.

● గద్వాల జిల్లా కేంద్రంలోని పిల్లిగుండ్ల కాలనీ, ఆర్డీవో కార్యాలయం వెనుకవైపు, రాఘవేంద్ర కాలనీ శివారు ప్రాంతాలను కూడా ఇలాంటి అడ్డాలకు వాడుకుంటున్నారు. ఇటీవల ఓ యాచకురాలికి కల్లు తాగించిన కొందరు ఆకతాయిలు అత్యాచారం చేసినట్లు తెలిసింది. కానీ అది బయటకు రాలేదు.

● నారాయణపేటలో దేవాలయం పక్కన ఎకో పార్కు నిర్మించగా.. అది ప్రేమ జంటలకు నెలవుగా మారింది. అసాంఘిక కార్యకలాపాలు కూడా అక్కడ జరుగుతున్నాయి.

● మహబూబ్‌నగర్‌లోని ఎకో పార్కులో కేవలం 12 సీసీ కెమెరాలు మాత్రమే ఎంట్రెన్స్ నుంచి కొద్దిదూరం వరకు ఉన్నాయి. ఇక్కడకి కూడా ప్రేమ జంటలు వచ్చి వెళ్తుంటాయి. అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఉంది. కానీ ఇప్పటివరకు ఎలాంటివి బయటకు రాలేదు. అలాగే దేవాలయాలకు వెళ్తున్న జంటలు చుట్టుపక్కల జనసంచారం తక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్తూ ఆకతాయిల బెదిరింపులకు గురవుతున్నారు.

● సోమశిల కాటేజీలను కూడా చాలామంది దుర్వినియోగం చేస్తున్నారు. వచ్చిన వారు ఎవరూ, ఏంటి అనేది చూడకుండానే రూమ్‌లు ఇస్తుండటంతో దుర్ఘటనలు జరిగే అవకాశం ఉంది.


గంజాయి

గంజాయి, మందు సిట్టింగులకు అడ్డాలు..

పార్కులు, అటవీ ప్రాంతాలు, జనసంచారం తక్కువగా ఉన్న ప్రాంతాలు గంజాయి బ్యాచ్‌లు, మందుబాబులకు అడ్డాలుగా మారాయి. తాగిన మైకంలో అక్కడికి వస్తున్న ప్రేమ జంటలను బెదిరించడం, లైంగిక వేధింపులకు గురిచేయడం పరిపాటిగా మారుతోంది. పరువు పోతోందని ఎవరూ ఫిర్యాదు చేయడం లేదు. ప్రతీ జిల్లాలో ఇలాంటి ప్రాంతాల్లో కొన్ని బ్యాచులు ఏర్పడి ఇదే పనిగా పెట్టుకుంటున్నాయి. బెదిరించి డబ్బులు గుంజడం కొందరు చేస్తుండగా.. మరికొందరు లైంగిక వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే తల్లిదండ్రుల పర్యవేక్షణ తక్కువ కావడం, కాలేజీలకు అని చెప్పి వచ్చి బలాదూర్ తిరగడం, సిగరెట్లు, మందు, గంజాయి తాగడం నానాటికీ పెరుగుతోంది. అదే సమయంలో పార్కులు, ఎక్కువ మంది వచ్చే ప్రదేశాల్లో నిఘాను కూడా కట్టుదిట్టం చేయడం లేదు. మయూరీ నర్సరీలో కేవలం 12 కెమెరాలు మాత్రమే ఉన్నాయి. మెజారిటీ పార్కుల్లో ఎంట్రెన్స్ మినహాయించి.. ఎక్కడా నిఘా ఉండటం లేదు. సీసీ కెమెరాల నిఘా పెట్టి, సూచిక బోర్డులు పెట్టడం ద్వారా అసాంఘిక చర్యలకు అడ్డుకట్ట వేయొచ్చు. జడ్చర్ల శివారులో యువకులు తరచూ గంజాయి తాగుతున్నారు.

గతంలో యువకులు కూడా పట్టుపడ్డారు. ఖిల్లాఘణపురం మండలంలో గట్టు పరిసర ప్రాంతాల్లో హుక్కా తాగడం, గంజాయి తాగడం జరుగుతోంది. దొంతికుంట తండాలో మోడల్ స్కూల్ ఉండటంతో అక్కడ ఆకతాయిల ఆగడాలు కూడా పెరిగాయి. పెబ్బేరు మునిసిపాలిటీలోని సంత ప్రాంతాన్ని తాగుబోతులు అడ్డాగా మార్చుకున్నారు. మద్యం తాగడం, దొంగతనాలకు పాల్పడటం వంటివి ఇక్కడ చేస్తున్నారు. రేవల్లి మండలంలో కూడా యువకులు గంజాయి సేవిస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. దేవాలయాల ఆవరణలో కూడా మద్యం తాగుతున్నారు. అలాగే మద్యం తాగుతూ పేకాట ఆడటం, ఆ మత్తులో జనసంచారం తక్కువ ఉన్న ప్రాంతాలకు ఎవరైనా వస్తే వేధింపులు చేయడం పరిపాటిగా మారుతోంది. సీసీ కెమెరాలను పార్కులు, దేవాలయాల పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసి, సూచిక బోర్డులు పెట్టడంతోపాటు.. పెట్రోలింగ్‌ను కూడా పెంచితే అనుచిత, అసాంఘిక ఘటనలకు కళ్లెం వేయొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శ్రీరంగాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలంలోని కంబాలాపూర్ సమీపంలోని రైస్ మిల్ వద్ద మంగళవారం రాత్రి కుక్క వెంబడించడంతో బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన ఘటన పాఠకులకు విధితమే. వీపనగండ్ల మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన చింతలయ్య, దుబ్బ చింతలయ్య (60)కు తీవ్ర గాయాలు కావడంతో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. బుధవారం దుబ్బ చింతలయ్య చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

సంపులో పడి బాలుడి మృతి


మానస్ మృతదేహం

మద్దూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సంపులో పడి బాలుడు మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని దంగాన్‌పూర్‌లో బుధవారం చోటు చేసుకొంది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మహిపాల్ కుమారుడు మానస్ (4) ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి సంపులో పడ్డాడు. గమనించిన బాలుడి తల్లి, నాయనమ్మ సంపులో నుండి తీసి చికిత్స నిమిత్తం మద్దూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాల భవనంపై నుంచి దూకిన విద్యార్థి

- చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలింపు


బాలుడు కిందపడిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దేవరకద్ర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాల భవనం పైనుంచి విద్యార్థి దూకి గాయపడిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని చౌదర్‌పల్లిలోని గురుకుల పాఠశాలలో చోటు చేసుకుంది. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన విద్యార్థి శ్రవన్ ఆరవ తరగతి చదువుతున్నాడు. విద్యార్థి మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో పాఠశాల భవనంపైకి వెళ్లి కిందికి దూకాడు. గదిలో స్నేహితుడు లేడని గమనించిన తోటి విద్యార్థులు వార్డెన్‌కు సమాచారం ఇచ్చారు. వార్డెన్ చుట్టుపక్కల పరిశీలించగా పాఠశాల వెనుక భాగంలో కింద పడి ఉండటంతో ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించి చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. గదిలో నుంచి ఎవరికీ చెప్పకుండా పాఠశాలపైకి వెళ్లి కిందకి దూకాడని, కుటుంబ సమస్యల కారణంగానే దూకి ఉండొచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారన్నారు. బుధవారం జిల్లా జోనల్ అధికారి రాణి, వాణిశ్రీ తహసీల్దార్ కృష్ణయ్య పాఠశాలను సందర్శించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని వారు తెలిపారు.

చిరుత దాడిలో గేదె మృతి

మరికల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : చిరుత దాడిలో గేదె మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని మాదారం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు కుర్వ వెంకటేశ్ తన గేదెను మంగళవారం రాత్రి పొలం వద్ద కట్టేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వెళ్లి చూడగా గేదె మృతి చెందింది. విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్టు అధికారులు గేదెను పరిశీలించి చిరుత దాడి చేసిందని నిర్ధారించారు.

స్టేట్‌హోమ్‌కు అనాథ పిల్లల తరలింపు

మరికల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మరికల్ మండలం గాజులయ్య తండాకు చెందిన రేణుక, మహేశ్‌ను బుధవారం స్టేట్ హోమ్ అధికారి కవితకు గ్రామస్థులు అప్పగించారు. ఈసందర్భంగా మాజీ ఉపసర్పంచ్ భాస్కర్‌నాయక్ మాట్లాడుతూ భార్యాభర్తలు దేగవత్ లక్ష్మి, రాములునాయక్ ముంబాయికి వలస వెళ్ల గా, భర్త 2019లో అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలిపారు. అప్పటి నుంచి తల్లి తండాలో ఇద్దరు పిల్లలను చూసుకుంటూ కూలీ పని చేసేది. ఈమె నాలుగు నెలల నుంచి క్యాన్సర్‌తో బాధపడుతుండేది. గ్రామస్థుల సహకారంతో వైద్యం చేయించుకుంటుండగా, గతనెల 21న పాము కాటు వేయడంతో మృతి చెందింది. ఆమె మృతితో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారడంతో తండా వాసులందరు కలిసి పిల్లల సంరక్షణ కోసం సంబం ధింత అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సేట్‌హోమ్ అధికారులు తండాకు వచ్చి విచారణ జరిపి పిల్లలను తీసుకెళ్లడం జరిగిందన్నారు.

రైలులో తప్పిపోయిన బాలిక..

సఖి సెంటర్‌కు తరలింపు

గద్వాల క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలిక రైలులో వస్తుంటే గుర్తించిన పోలీసులు సఖి సెంటర్‌కు తరలించిన ట్లు జిల్లా బాలల సంరక్షణ విభాగం కౌ న్సెలర్ సురేష్, 1098 కోఆర్డినేటర్ శివలీల తెలిపారు. బుధవారం ఉదయం ఓ బాలి క మహబూబ్‌నగర్ నుంచి రైలులో వస్తుంటే గద్వాల రైల్వే పోలీసులు గుర్తిం చారు. 1098కు కాల్ చేయగా జిల్లా సంక్షేమాధికారి ఆదేశాల మేరకు బాలల సంరక్షణ విభాగం కౌన్సెలర్, 1098 కోఆర్డినేటర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి ఆ బాలికను చైల్డ్ వె ల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచారు. బాలికది చేగుంట గ్రామం తిమ్మాజిపేట మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా అని తెలి పిందన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు ప్రస్తుతం గద్వాలలోని సఖి కేంద్రాం లో ఉంచామని, గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగిస్తామని వారు పేర్కొన్నారు.

సారా తయారు చేస్తే కఠిన చర్యలు

ఊర్కొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి హెచ్చరించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఠాకూర్‌తండా, మఠం తండా, అమ్మపల్లితండాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ మహబూబ్‌నగర్ టీం దాడులు చేసి 300 లీటర్ల బెల్లం పానకం, పది లీటర్ల సారాను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఠాకూర్ తండాకు చెందిన రమావత్ రవిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలకృష్ణారెడ్డి, సిబ్బంది యాదగిరి, రఘు, నర్యా, మాధవి, పరశురామ్ పాల్గొన్నారు.

ఖర్చులకు డబ్బులు ఇవ్వలేదని..

ఉరి వేసుకొని యువకుడి బలవన్మరణం


గొల్ల భోగం శివ (ఫైల్)

మూసాపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఖర్చుల కోసం డబ్బులు అడిగితే ఇవ్వలేదని యువకుడు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలంలో చోటు చేసుకుంది. మూసాపేట ఎస్ఐ ముల్కలపల్లి వేణు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామానికి చెందిన గొల్ల బోగం శివ (32) కూలీ పని చేస్తు జీవనం కొనసాగిస్తున్నాడు. ఖర్చుల కోసం తల్లితో గొడవ పడి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. పక్క గ్రామమైన మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి శివారులోని ఎన్‌హెచ్-44 సోలార్ గేట్ వద్ద ఉన్న చెట్టుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా..

- ఆదర్శంగా నిలుస్తున్న సింగోటం ప్రాథమిక పాఠశాల
- సొంత ఖర్చుతో బ్రోచర్లు ముద్రించి హెచ్ఎం ప్రచారం
- విద్యార్థుల హాజరుశాతం పెంచేలా చర్యలు


సింగోటం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం

కొల్లాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్ది విద్యార్థులను ప్రగతి బాటలో నడిపిస్తున్నారు ఉపాధ్యాయులు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని సింగోటం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న బ్యంగి కృష్ణ ప్రసాద్ తనదైన శైలిలో పాఠశాలను తీర్చిదిద్దారు. సొంతంగా బ్రోచర్‌ను తయారు చేసి గ్రామంలో తల్లిదండ్రులకు వివరించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్నారు. వేసవి సెలవుల కన్నా ముందే ఈ నెల 5వ తేదీ నుంచి ప్రతి రోజు పాఠశాల ముగిసిన తర్వాత, తనతో పాటు ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో బడి బాట నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉన్న 91 మంది విద్యార్థుల సంఖ్య నుంచి 2వేలకు పైగా పెంచేలా పాఠశాల ఉపాధ్యాయులు నిర్ణయించుకున్నారు. పాఠశాలలో ప్రతీ నెల తప్పనిసరిగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తూ సలహాలు సూచనలు ఇస్తున్నారు. అదేవిధంగా పాఠశాలకు ఇంటి నుంచి బయలుదేరిన విద్యార్థులు మధ్యలో అపరిచితుల వ్యక్తుల వాహనాలు ఎక్కకుండా ప్రధానోపాధ్యాయుడు కారులో విద్యార్థులను తీసుకెళ్తున్నారు. పాఠశాలలో నిర్వహించే పలు సాంస్కృతిక క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులను ప్రోత్సహించేలా వారికి ఉన్నత విద్యాధికారులచే ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందిస్తున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యే నిధుల నుంచి పాఠశాలకు రూ.30 లక్షలు కేటాయించ డంతో విద్యార్థులకు మౌలిక వసతులు అన్నీ సమకూరాయి. విద్యార్థులకు కంప్యూటర్ విద్యాబో ధన అందించేందుకు రత్నగిరి ఫౌండేషన్ ద్వారా కంప్యూటర్ అందజేశారు. పచ్చని వాతావరణం ఉం డేలా పాఠశాలను తీర్చిదిద్దారు. ఉపాధ్యాయుల కృషితో వచ్చే విద్యా సంవత్సరంలో సింగోటం ప్రభు త్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు హాజరు శాతం తప్పక పెరుగుతుందని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.


పాఠశాల ప్రగతి బ్రోచర్

మెరుగైన విద్య అందించడమే..



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం అంకిత భావంతో మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తాను. ఉన్నతాధికారుల ప్రోత్సాహంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచేలా తోటి ఉపాధ్యాయులు సహకరిస్తున్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వసతులు, పౌష్టికాహారం అందిస్తున్నాం. తల్లిదండ్రులను చైతన్య పరుస్తు ప్రతి విద్యార్థిని ప్రభుత్వ బడిలో చేర్పించేలా చర్యలు చేపడుతున్నాం.

- బ్యంగి కృష్ణ ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

'ఆర్థిక మోసగాడికి నేతల అండ'

మక్తల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నాలుగేళ్ల క్రితం షేర్‌మార్కెట్ పేరుతో షేక్ సుభానీ స్థానికంగా దాదాపు 200మంది బాధితుల నుంచి రూ.100కోట్లకు పైగా వసూలు చేసి ఉడాయించిన ఘటనలో నేతల సహకారం ఉన్నట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా కావలిలో ఇదే తరహాలో మోసాలకు పాల్పడి ఫిబ్రవరి 12న పోలీసులకు పట్టుబడ్డాడు. విషయం వెలుగులోకి రావడంతో ఈ ప్రాంత బాధితులు అక్కడి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఎదుట తమ బాధను వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా నారాయణపేట ఎస్పీ యోగేష్‌గౌతమ్ ప్రత్యేక చొరవ తీసుకొని కోర్టు అనుమతితో మక్తల్ పోలీస్‌స్టేషన్‌కు రప్పించి నిందితుడి నుంచి వివరాలు రాబట్టారు. అతడి ల్యాప్‌టాప్‌లో అనేక విషయాలు నమోదు చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ప్రాంత రాజకీయ నాయకులకు ఇచ్చిన మాముళ్లు, ఏజెంట్లకు ఇచ్చిన కమీషన్ వివరాలు సేకరించారు. షేక్‌సుభానీ చాకచక్యంగా రూ.కోట్లు వసూలు చేసి అప్పట్లో జ్యువెలరీ దుకాణం సైతం ప్రారంభించాడు. షేక్‌సుభానీ పరారీ విషయాన్ని పసిగట్టిన ఓ నాయకుడు దుకాణంలో ఉన్న బంగారు ఆభరణాలు సైతం కాజేసినట్లు ల్యాప్‌టాప్‌లో నిక్షిప్తం చేసుకున్నాడు. మరికల్ పట్టణానికి చెందిన ఓ యువకుడు రూ.5.36 కోట్లు షేక్ సుభానీ వద్ద పెట్టుబడి పెట్టాడు. అలాగే పట్టణానికి చెందిన మైనా ర్టీ నాయకుడు రూ.70లక్షలు పెట్టుబడి పెట్టాడు. మాగనూరు, కృష్ణ, నర్వ, ఊ ట్కూర్ మండలాలకు చెందిన అనేక మంది అప్పులు చేసి మరీ పెట్టుబడి పె ట్టారు. ప్రజలను సులువుగా మోసం చేయడానికి ఊట్కూర్ పట్టణానికి చెందిన ఓ ప్రముఖ వ్యక్తికి భూమి కొన్నట్లు అగ్రిమెంట్ చేసుకొన్నాడు. పట్టణానికి చెందిన ఓ రాజకీయ నాయకుడికి అడ్వాన్సుగా భూమిని కొనుగోలు చేసేందుకు నగదు చెల్లించాడు. విషయం తెలిసిన పోలీసులు అప్పట్లో షేక్ సుభానీ వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. అతని ఆస్తులను జప్తుచేసి మోసపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

శాంతి భద్రతలు కాపాడటంలో ప్రభుత్వం విఫలం

- హెచ్‌సీయూ భూముల వ్యవహారం డైవర్షన్ పాలిటిక్స్
- బీసీలకు 56 శాతం రిజర్వేషన్లు కల్పించాలి
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ విమర్శించారు. హోంశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలోనే మహిళలకు అఘాయిత్యాలు జరగడం శోచనీయన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 26న బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన మహనీయుల జాతర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక బహుజన మహిళలపై అఘాయిత్యాల జరడం ఆందోళనకర మన్నారు. యువత గంజాయికి అలవాటు పడి మహిళలపై దారుణాలకు ఒడిగడుతున్నారని, శాంతి భద్రతలు కాపాడాల్సిన ప్రభుత్వం, పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇటీవల షాద్‌నగర్‌లో దళిత మహిళ, కొల్లాపూర్‌లో గిరిజన మహిళలపై అఘాయిత్యాలు జరుగగా, తాజాగా ఊర్కొండపేటలో బీసీ మహిళపై లైంగిక దాడి జరిగిందని తెలిపారు. చివరకు పుణ్యక్షేత్రాల వద్ద కూడా ప్రజలకు భద్రత కరువైందన్నారు. మహిళపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించి మరోమారు ఇలాంటివి కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయని, బీసీ రిజర్వేషన్లపై బహుజనులు ఉద్యమానికి సిద్ధమైన వేళ హెచ్‌సీయూ భూముల వ్యవహారాన్ని ప్రభుత్వం చర్చలోకి తీసుకొచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్‌కు బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉంటే అది నాయకత్వంతో పార్లమెంట్‌లో మాట్లాడించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిషానీ రామచంద్ర, దాగిళ్ల దయానంద్‌రావు, శివరామకృష్ణ, చంద్రశేఖర్, గుండెల ధర్మేందర్, అంతటి నాగన్న, పృథ్వీరాజ్, రాంచందర్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఆర్ఎం సంతోష్‌కుమార్


మాట్లాడుతున్న ఆర్ఎం సంతోష్‌కుమార్

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కస్తామని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ పి.సంతోష్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక పారిశ్రామిక వాడలోని ఫోరం కార్యాలయంలో నిర్వహించిన ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్యంపై పూర్తి శ్రద్ధ వహించాలని సూచించారు. వారికి డాక్టర్‌ను అందుబాటులో ఉంచామని, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసి మందుల సరఫరాలో కొరత లేకుండా చేశామన్నారు. బకాయిలను సంస్థ ఎండీకి నివేదికను పంపి పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు. జీవితకాలపు ఉచిత ప్రయాణ బస్‌పాస్ జారీలో జరుగుతున్న జాప్యాన్ని నివారిస్తామన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఏ సమస్య వచ్చిన మొదటి ప్రాధాన్యత నిచ్చి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు అధ్యక్షుడు రాజసింహుడు మాట్లాడుతూ సర్వీసులో ఉండి చనిపోయిన ఉద్యోగస్తుల వారసులకు వెంటనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, 2022 ఏప్రిల్ నుండి రిటైర్డ్ అయిన ఉద్యోగుల బకాయిలు, 2017 పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో జీబీ పాల్, భగవంతు, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.నారాయణ, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, కార్యదర్శి నాగభూషణం, లలితమ్మ, బుచ్చన్న, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కన్వేయర్ బెల్ట్ సిద్ధం

- వేగం పుంజుకోనున్న సహాయక చర్యలు
- 13.600 నుంచి 13.730 కిలో మీటర్ల వరకు బెల్ట్ పొడిగింపు


టీబీఎం శిథిలాలను కత్తిరిస్తున్న రెస్క్యూ టీం సభ్యులు


సొరంగంలో సిద్ధం అయిన కన్వేయర్ బెల్ట్

దోమలపెంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో బురద మట్టి శిథిలాలను తొలగించేందుకు కన్వేయర్ బెల్ట్ పాత్ర కీలకం. సహాయక చర్యల్లో వేగం పెంచేందుకు రెస్క్యూ బృందాలు మూడు రోజులు శ్రమించి కన్వేయ ర్ బెల్ట్ ట్రాక్‌ను బుధవారం 13.600 కిలో మీటర్ల నుంచి 13.730 కిలో మీటర్లకు పొడిగిస్తూ సిద్ధం చేశారు. దీంతో పాటు టీబీ ఎంకు సంబం ధించిన ఇనుప గడ్డర్లను రెస్క్యూ బృందాలు ప్లాస్మా, గ్యాస్, థర్మల్ కట్టర్లతో కత్తిరించి లోకో ట్రైన్ ద్వా రా బయటకు తరలిస్తున్నారు. గురు వారం నుంచి కన్వేయర్ బెల్ట్‌పై మట్టి బురద తరలించడంతో పాటు, ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు చేపట్ట నున్నట్లు సహాయ చర్యల్లో పాల్గొనే రెస్క్యూ బృందాల అధికారులు చెబుతున్నారు.

పీయూలో నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఈఎస్ఐ వర్తింపు


పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్‌కు పూలబొకే అందజేస్తున్న నాన్‌టీచింగ్ ఉద్యోగులు

పాలమూరు యూనివర్సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఇటీవల ఉన్నతాధికారుల సమావేశంలో చర్చించి ఈఎస్ఐ అమలు చేశారు. దీంతో బుధవారం పీయూ పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో వీసీ జీఎన్ శ్రీనివాస్‌కు నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో పూలబొకే అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనివర్సిటీ ఏర్పాటు చేసి దాదాపు 20ఏళ్లు కావస్తున్నా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్ట్, తాత్కాలిక ఉద్యోగులందరికీ కనీస వేతనాలను పెంచాలనీ, ఏటా 12శాతాన్ని అమలు చేయాలని కోరారు. స్పందించిన వీసీ త్వరలోనే వేతనాలను పెంచుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీయూ నాన్ టీచింగ్ ఉద్యోగుల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి రథోత్సవం


యాదవనగర్‌లో రథాన్ని లాగుతున్న భక్తులు

మక్తల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని యాదవనగర్‌లో వెలసిన వీరభద్రస్వామి రథోత్సవాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం 5 గంటలకు అగ్నిగుండం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించారు. మంగళవారం రాత్రి నిర్వహించిన భజన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గురువారం పల్లకీసేవ, కోలాటం, భజనలు ఉంటాయని అర్చకులు శివయ్య, సంతోష్, వీరభద్రస్వామి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

కనుల పండువగా కల్యాణోత్సవం


వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మిడ్జిల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓడికే వేంకటేశ్వరస్వామి ఆలయ మూడవ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు యుగంధర్‌శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు వెంకటేశ్వర్ రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి పాల్గొన్నారు.

అర్చకుడి వ్యవహారంపై విచారణ


మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి

అలంపూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అలంపూర్‌లోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల ఉప ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ వ్యవహారంపై బుధవారం దేవాదాయశాఖ అధికారులు విచారించారు. దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి మాట్లాడుతూ.. అర్చకుడు ఆనంద్‌శర్మపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర పూర్తి విచారణ చేపట్టామన్నారు. ఆలయంలోని ఉద్యోగులను విచారణ చేసి వారి నుంచి పూర్తి వివరాలు తీసుకున్నాం. ఈ నివేదిక కమిషనర్‌కు రెండు రోజుల్లో అందిస్తామన్నారు. ప్రభుత్వం సంపూర్ణంగా నివేదిక సేకరించి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

తగ్గిన చింతపండు ధరలు

నవాబ్‌పేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాలాజీ మార్కెట్ యార్డులో చింతపండు, వేరుశనగ ధరలు కాస్త తగ్గుముఖం పట్టాయి. గత వారం క్వింటాలుకు రూ.14,000 పలకగా, ఈ వారం రూ.12,308 పలికింది. సాధారణ ధర రూ.10,608 కాగా కనిష్ఠంగా రూ.6,690 చెల్లించినట్లు మార్కెట్ కార్యదర్శి రమేష్ కుమార్ బుధవారం తెలిపారు. అలాగే వేరుశనగ కొనుగోలు మందగించడంతో ధరలు సైతం కాస్త తగ్గాయి. మొత్తం 733 బస్తాలు (220 క్వింటాళ్లు) రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.6,228, కనిష్ఠంగా రూ.5,408 చెల్లించినట్లు కార్యదర్శి తెలిపారు.

గురుకుల పాఠశాల సమస్యలు పరిష్కరిస్తా

హన్వాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన గురుకులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. గదుల సమస్య ఉందని ప్రిన్సిపాల్ ఎమ్మెల్యేకు వివరించగా, గదుల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ భూమిని గుర్తించి నూతన భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు.

మధురానగర్ బస్టాప్‌లో బస్సులు నిలపాలి

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని మధురానగర్ బస్టాప్‌లో ఆర్టీసీ బస్సులను నిలపాలని మధురానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, కోశాధికారి అహ్మద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సంతోష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మధురానగర్‌కాలనీ వాసులు అందరం కలిసి బస్‌షెల్టర్ ఏర్పాటు చేసుకున్నామని, ఈ రూట్లలో తిరిగే ఆర్టీసీ బస్సులు బస్‌స్టాప్‌లో నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

మిడ్జిల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగలిగడ్డతండా గ్రామ పంచాయతీ మొదలుకుంటతండాలో నిర్మిస్తున్న సంత్ సేవాలాల్ మహరాజ్, మేరమ్మ ఆలయ నిర్మాణానికి లాక్యతండాకు చెందిన జర్పుల భాస్కర్‌నాయక్ రూ.2,22,222 ఆలయ నిర్మాణ కమిటీకి బుధవారం హైదరాబాద్‌లో అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, తండావాసులు శ్రీనివాస్‌నాయక్, అంబ్రియ, సోమ్లా, శ్రీను, మహేష్, మల్లేష్, మోతీలాల్, ప్రవీణ్, సిద్దు పాల్గొన్నారు.

రాజీవ్ యువవికాసం పథకం దరఖాస్తు గడువు పొడిగింపు

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీ నిరుద్యోగ యువత (ముస్లిం, క్రిష్టియన్, సిక్కు, బౌద్దులు, పార్శీ) రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తు గడువు ఈనెల 14వ తేదీ వరకు పెంచినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి శంకరచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారి ఆదాయం రూ.1.50 లక్షలకు, పట్టణ ప్రాంతాల వారి ఆదాయం రూ.రెండు లక్షలకు మించకూడదని, రేషన్‌కార్డులో ఒక్కరూ మాత్రమే అర్హులన్నారు. అర్హత, ఆసక్తి గల నిరుద్యోగులు టీఎస్ ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తమ దరఖాస్తులు సమర్పించాలని కోరారు. దరఖాస్తులకు సరైన ధ్రువపత్రాలు సమర్పించి వచ్చే నెల 14 లోగా తమ సమర్పించాలని వెల్లడించారు.

అపర కర్మల భవన నిర్మాణానికి భూమి పూజ

జడ్చర్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుర్వగడ్డపల్లి సమీపంలో గల దుందుబీ నది మీనాంబరం పరశవేదీశ్వర స్వామి ఆలయం సమీపంలో అపర కర్మల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. శ్రీరాజ రాజేశ్వరీ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించే భవన నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. అందరి సహయ, సహకారాలతో భవనాన్ని నిర్మించనున్నట్లు ట్రస్టు సభ్యులు పేర్కొన్నారు. ట్రస్ట్ చైర్మన్ రవీందర్‌రావు, అశోక్, ఇఎల్ఎన్ రావు, రంగారావు, ప్రవీణ్, సాయిస్రుజన్, నరసింహరావు, వెంకటేశ్వర్‌రావు, జీవీవీ శర్మ, మోహన్‌రావు, శ్రీధర్‌రావు, శిరీష్, రాఘవేందర్‌రావు, ఇంద్రకుమార్, క్రాంతం, శంకర్‌బాబు, ప్రవీణ్ పాల్గొన్నారు.

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి జరిగిన ఐఎన్‌టీఎస్‌వో లెవల్-2 పరీక్షలో ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన 180 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 160 మంది సత్తాచాటారు. కాగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను పాఠశాల ఏజీఎం భాస్కర్‌రెడ్డి, కోఆర్డినేటర్ రఘుబాబు, ప్రిన్సిపాల్ శ్రీధర్, డీన్ మహేష్, ఇన్‌చార్జిలు నాసీర్, మేఘా అభినందించారు.

పూలే జయంతిని ఘనంగా నిర్వహించాలి

పాలమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. బుధవారం పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతిని బీసీ సమాజ్ ఆధ్వర్యంలో కలిశారు. విశ్వవిద్యాలయంలో పూలే అధ్యయన కేంద్రాన్ని ప్రారంభించాలని కోరారు. మాజీ డీఈవో డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్, బీసీ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు డాక్టర్ బి.శ్రీకాంత్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు సారంగం లక్ష్మికాంత్, కుమ్మరి సంఘం బుగ్గన్న, డాక్టర్ వి.భూమయ్య, రామ్మోహన్ పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మకం

» ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

» కలెక్టర్‌తో కలిసి సన్నబియ్యం పంపిణీ



మహబూబ్‌నగర్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి



కారుకొండలో సన్నబియ్యం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్/హన్వాడ ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సన్నబియ్యం పంపిణీ చేయాలనే నిర్ణయం చరిత్రాత్మకమైనదని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో పేదలకు నిత్యావసర సరుకులు కూడా సక్రమంగా పంపిణీ చేయలేదని, ఒక్క రేషన్ కార్డు కూడా పంపిణీ చేయలేదని విమర్శించారు. బుధవారం నగరంలోని వీరన్నపేట, కిసాన్‌నగర్, పాత పాలమూరు, బండమీదిపల్లి చౌకధర దుకాణాల్లో కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి సన్నబియ్యం పంపిణీ చేసి, మాట్లాడారు. గత ప్రభుత్వం చౌకధర దుకాణాల్లో నిత్యావసర సరుకుల పంపిణీ ఎత్తివేసి కేవలం దొడ్డుబియ్యం పంపిణీకే పరిమితం చేశారన్నారు. పేదలు, ధనికులు అందరూ ఒకే రకమైన బియ్యం తినాలని కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు. దీంతో పాటు మరికొన్ని సరకులు పేదలకు అందించాలని ప్రజాప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ సంవత్సరం మొత్తం 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉందని, ఇందుకు 25 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించామన్నారు. అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, నాయకులు బెక్కరి అనిత, సిరా జ్‌ఖాద్రి, అంజయ్య, పద్మ నక్క శ్రీనివాస్, పార్వతి పాల్గొన్నారు. అంతకుముందు మహబూబ్‌నగర్ రూరల్ మండలం ఓబులాయపల్లి, హన్వాడ మండల కేంద్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. హన్వాడలో తహసీల్దార్ కిష్యానాయక్, ఎంపీడీవో యశోదమ్మ, మండల అధ్యక్షుడు మహేందర్, జిల్లా నాయకుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు అంజనేయులు, షబ్బీర్, వెంకటయ్య, నర్సిములు, రామకృష్ణ, కృష్ణయ్య పాల్గొన్నారు.

● జడ్చర్ల : జడ్చర్ల పట్టణంలోని రేషన్ దుకాణాల వద్ద మునిసిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు.

● నవాబ్‌పేట : పేదలందరికీ ప్రభుత్వ ఫలాలు అందించడమే తమ లక్ష్యమని కాంగ్రెస్ నాయకుడు జనుంపల్లి దుశ్యంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కారుకొండ, సిద్దోటం, యన్మనగండ్ల, కామారం, పోమాల, చౌడూర్, ఆర్సీపూర్ గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ హరలింగం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, నాయకులు భూపాల్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, నవాజ్‌రెడ్డి, హమీద్ మహేక్, వాసుయాదవ్, సత్యనారాయణగౌడ్, జమిరోద్దీన్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

● మిడ్జిల్ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం కార్యక్రమాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ చైర్మన్ తంగెళ్ల జ్యోతి అల్వాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొత్తూరు, మిడ్జిల్ గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ చేశారు. అదే విధంగా రాణిపేటలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రబ్బానీ పంపిణీ చేయగా, ఆయా గ్రామాల్లో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి సన్నబియ్యం పంపిణీ చేశారు.



నెల్లికొండలో చేపట్టిన పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్



హన్వాడలో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయం

» జైబాపు జైభీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే జీఎంఆర్

చిన్నచింతకుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందని ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు మండలంలోని నెల్లికొండి గ్రామంలో చేపట్టిన జైబాపు జైభీమ్ జై సంవిధాన్ పాదయాత్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు. అదే విధంగా బండర్‌పల్లి గ్రామంలో మండల నాయకుల ఆధ్వర్యంలో గ్రామంలోని ఆయా వార్డుల్లో పాదయాత్రను నిర్వహించారు. ఆయా కార్యక్రమంల్లో దేవరకద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, పట్టెం శివకుమార్, నాయకులు కృష్ణకుమార్‌రెడ్డి, తెలుగు వెంకటేష్, యువజన కాంగ్రెస్ నాయకులు ఎస్.వెంకటేష్, డీటీ చంద్రశేఖర్, సివిల్ సప్లైయ్ డీటీ అమీర్ ఖాన్, ఆర్ఐ తిరుపతయ్య పాల్గొన్నారు.

● మూసాపేట : అడ్డాకుల మండల కేంద్రంలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి పాదయాత్ర నిర్వహించారు. ముందుగా అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారులపై ర్యాలీతో పాదయాత్ర చేపట్టారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట శ్రీహరి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, డీసీసీ కార్యదర్శి గంగుల విజయమోహన్‌రెడ్డి, షఫీఅహ్మద్, దశరథరెడ్డి, భీమన్నయాదవ్, శేఖర్‌రెడ్డి, శరత్‌కుమార్‌రెడ్డి, వేగనాథ్, రాములు పాల్గొన్నారు.

● హన్వాడ : మండలంలోని వేపూర్, రామన్నపల్లి గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జై బాపు జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మండల అధ్యక్షుడు మహేందర్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేశారు. నాయకులు యాదవరెడ్డి, పెంటయ్య, అచ్చన్న, నవనీత, శ్రీను, నర్సిములు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న జాతీయ మహిళా సమాఖ్య సభ్యులు

పాలమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండపేటలో మహిళపై అత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి కె.పద్మావతి డిమాండ్ చేశారు. బుధవారం భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో నిరసన చేపట్టి, మాట్లాడారు. సమాజం తలదించుకునేలా ఊర్కొండపేట ఘటన ఉందన్నారు. మద్యం మత్తులో మహిళ పట్ల దారుణానికి ఒడిగట్టిన నిందితులు గతంలో ఇలాంటి ఘటనలు చేసినట్లు వార్తలు ప్రచారంలో ఉన్నాయన్నారు. బాధితురాలు దాహం వేస్తుందని వేడుకుంటే మూత్రం పోసిన తీరు అమానుషమన్నారు. కిరాతకులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా శిక్షించాలన్నారు. నాయకురాళ్లు మాధవి, సత్యమ్మ, సింధు, లక్ష్మికళ, వరలక్ష్మి, పద్మ, జ్యోతి, మణెమ్మ, అనన్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

మిడ్జిల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అధికార పార్టీ నాయకులు అనుమతుల పేరుతో ఇసుకను తరలించాలని చూస్తే దుందుబీవాగు పరిసర గ్రామాల రైతులతో కలిసి పెద్దఎత్తున చేపడుతామని బీఆర్ఎస్ నాయకులు బుధవారం తహసీల్దార్ రాజుకు వినతి పత్రం అందజేశారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వ పనులకు ఇసుక తరలింపు చేపడితే అడ్డుకున్న ప్రస్తుత అధికార పార్టీ నాయకులు ఇప్పుడు ఇసుక రవాణాకు వంతపాడటం ఎంతవరకు సమంజసమన్నారు. మండలంలోని అభివృద్ధి పనులకు ట్రాక్టర్ల ద్వారా మాత్రమే అనుమతులివ్వాలని, లేకుంటే ఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాండు, మాజీ ఎంపీపీ సుదర్శన్, నాయకులు జంగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, మంద భీంరాజు, బంగారు, జగన్‌గౌడ్, గోపాల్, రవీంద్ర, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి

భూత్పూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్. కే.పద్మావతి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు వేసవికాలం ఎన్ఎస్ఎస్ క్యాంపు కార్యక్రమాల్లో భాగంగా బుధవారం భూత్పూర్ మునిసిపాలిటీలోని గోప్లాపూర్‌లో జాతీయ స్వయం సేవా (ఎన్ఎస్ఎస్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పద్మావతితో పాటు ఉప ప్రధానాచార్యులు డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ రవీందర్‌రావు హాజరై మాట్లాడారు.సమాజంలో జరుగుతున్న రుగ్మతల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని, సమాజంలో ఎలా మెలగాలి, విద్యావల్ల ఎన్ని లాభాలు ఉన్నాయి. అనే విషయాలను ఈ క్యాంపుల ద్వారా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్థులు మేకల సత్యనారాయణ, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, లక్ష్మారెడ్డి, ప్రోగ్రాం అధికారులు సుభాషిణి, స్వరూప, బాలరాజు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత సర్వాయి పాపన్నగౌడ్



వెన్నచెడ్ గ్రామంలో సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

పాలమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : స్ఫూర్తి ప్రదాత సర్వాయి పాపన్నగౌడ్ అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గ్రీన్‌బెల్ట్ ఏరియాలో సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించి, మాట్లాడారు. భావి తరాలకు పాపన్నగౌడ్ చరిత్రను అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని, వర్ధంతిని అధికారికంగా నిర్వహించడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్, షబ్బీర్‌అహ్మద్, సత్తూర్ చంద్రకుమార్‌గౌడ్, సిరాజ్‌ఖాద్రి, అజ్మత్‌అలీ, ప్రవీణ్ కుమార్, తిరుమల వెంకటేష్, ఖాజాపాషా, రాషెద్‌ఖాన్, మోసిన్, అంజద్, అర్షద్‌అలీ, బీసీ సంక్షేమశాఖ అధికారి ఇందిర పాల్గొన్నారు.

● గండీడ్ : మండలంలోని వెన్నచెడ్ గ్రామంలో బుధవారం సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దత్తుగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య గౌడ్, గౌరవ అధ్యక్షుడు రవిగౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, నాయకులు చెన్నయ్య, పులేందర్, వెంకట్‌రాములు, రాములు, ఆశన్న పాల్గొన్నారు.

ఈనెల 30 వరకు 30 పోలీసు యాక్టు అమలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈనెల 30 వరకు జిల్లాలో 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని ఎస్పీ జానకి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చట్టం అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజన్ పోలీసు అధికారి, పోలీసు ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఎటువంటి మీటింగ్‌లు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించరాదన్నారు. నిషేధిత ఆయుధాలైన కత్తులు, కర్రలు, జెండా కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, నేరమును పురిగొలిపే ఎలాంటి ఆయుధాలు వినియోగించకూడదని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది, చికుకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్‌లు, జన సమూహాలను పోగు చేసి తిరగడం నిషేధమన్నారు. లౌడ్ స్పీకర్లు, డీజేలు కూడా నిషేధమని వివరించారు. ఎవరైనా ఉల్లంఘిస్తే 1861 చట్టం కింద శిక్షార్హులవుతారన్నారు.

ఓపెన్ ప్లాట్లలో చెత్త వేస్తే చర్యలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి కార్పొరేషన్ స్వచ్ఛ ఆటోలకు అందించాలని, అలా కాకుండా ఓపెన్ ప్లాట్లలో చెత్త వేసే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్, స్పెషల్ ఆఫీసర్ శివేంద్రప్రతాప్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం షైత్రీనగర్ నుంచి ఎంవీఎస్ కళాశాల వరకు చెత్త సేకరణ విషయమై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు వీధుల్లో చెత్త వేయకూడదని, ఇంట్లో తడి, పొడి చెత్తలను వేరుచేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలని కోరారు. ప్రజలు గృహ, వాణిజ్య నిర్మాణాలు అనుమతి తీసుకున్న మేరకే నిర్మించాలని కోరారు. ఇప్పటి వరకు ఆస్తి పన్ను సెటిల్మెంట్ చేసుకోకుండా ఉన్న గృహ, వాణిజ్య యజమానులు వెంటనే ఆస్తి పన్ను సెటిల్మెంట్ చేసుకోవాలని కోరారు. కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, డీఈఈ నరసింహ, ఏఈ వైష్ణవి, టీపీవో లక్ష్మిపతి, శానిటరి ఇన్‌స్పెక్టర్ రవీందర్ పాల్గొన్నారు.

ఘాటు తగ్గిన ఉల్లి

» క్వింటాలుకు గరిష్ఠంగా రూ.1,800, కనిష్ఠంగా రూ.1,170



మార్కెట్‌కు వచ్చిన ఉల్లి

దేవరకద్ర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రోజురోజుకూ తగ్గుతున్న ఉల్లి ధరలు రైతులను నిరాశకు గురి చేస్తున్నాయి. దేవరకద్ర మార్కెట్ యార్డులో వ్యాపారులు బుధవారం నిర్వహించిన వేలం పాటలో క్వింటాలుకు గరిష్ఠంగా రూ.1800, కనిష్ఠంగా రూ.1170 ధర పలికినట్లు మార్కెట్ సెక్రటరీ ఎల్లయ్య తెలిపారు. రెండో రకం ఉల్లికి గరిష్ఠంగా రూ.1485, కనిష్ఠంగా రూ.900 విక్రయించగా, మార్కెట్‌కు మొత్తం 592 క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి తెచ్చినట్లు చెప్పారు. నెల రోజులుగా ధరల్లో హెచ్చుతగ్గులు ఉంటున్నాయి. ధరల తగ్గుదలతో పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు అంటున్నారు. ఇప్పుడు సీజన్ కావడంతో మార్కెట్‌కు ఉల్లి వస్తోంది. కర్నూల్, హైదరాబాద్ మార్కెట్‌లకు మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి వందలాది లారీల ఉల్లి రావడంతో ధరలు పడిపోయాయని వ్యాపారులు అంటున్నారు. బయట నుంచి వచ్చే ఉల్లి ధర కంటే దేవరకద్ర మార్కెట్‌లో ధర క్వింటాలుపై రూ.300 నుంచి రూ.400 ఎక్కువగా ఉందని వ్యాపారులు తెలిపారు. ఎక్కువగా ఎర్ర ఉల్లిను పండించిన కారణంగా ధరలు రావడం లేదని అంటున్నారు. తెల్ల ఉల్లికి కొంత వరకు డిమాండ్ ఉంది.

హెచ్‌సీయూ భూములు విక్రయించొద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పాలమూరు/పాలమూరు యూనివర్సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ (హెచ్‌సీయూ)లో ఉన్న భూములను కాంగ్రెస్ పార్టీ కార్పొరేట్ శక్తులకు అమ్మకాన్ని నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి, మాట్లాడారు. హెచ్‌సీయూ 400 ఎకరాల భూములను అమ్మడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని, అందులో భాగంగానే ఈమధ్య యూనివర్శిటీ విద్యార్థులు పోరాటం చేస్తున్నారని తెలిపారు. నాయకులు కిల్లె గోపాల్, చంద్రకాంత్, రాజ్, నాగరాజు, నరేష్, గోవర్ధన్, బుచ్చన్న పాల్గొన్నారు. అదే విధంగా పాలమూరు యూనివర్శిటీ పీజీ సెంటర్‌లోని పీజీ కళాశాల తరగతులు, ఫార్మసీ కళాశాల తరగతులు బహిష్కరించి ఏబీవీపీ విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. పీయూ ఏబీవీపీ అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ భూములను అమ్మి సొమ్ము చేసుకునే ప్రయత్నాలు మానుకోవాలన్నారు.

హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ విడుదల



శోభాయాత్ర పోస్టర్ విడుదల చేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 12న పౌర్ణమి రోజు హనుమాన్ జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించే హనుమాన్ శోభాయాత్ర పోస్టర్లను బుధవారం గణేష్ భవనంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 12న సాయంకాలం 4 గంటలకు రామ మందిర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన శోభాయాత్ర గడియారం చౌరస్తా, బాలగంగాధర్ తిలక్ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, న్యూటౌన్ చౌరస్తా మీదుగా టీటీడా కల్యాణ మండపానికి చేరుకుంటుందన్నారు. యువజన సంఘం సభ్యులు, ధార్మిక, స్వచ్ఛంధ సంస్థల సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి నాగరాజు, విభాగ్ సహ కార్యదర్శి లక్ష్మీనారాయణ, విభాగ్ సత్సంగ సంయోజక్ రాచాల జనార్దన్, జిల్లా ఉపాధ్యక్షుడు చాపల హనుమంతు, జిల్లా కోశాధికారి శ్రీధర్‌బాబు, నగర అధ్యక్షుడు విగ్నేష్, నగర ఉపాధ్యక్షులు శివ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



సైబర్ నేరాలపై విద్యార్థులకు వివరిస్తున్న జడ్చర్ల సీఐ కమలాకర్

జడ్చర్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జడ్చర్ల సీఐ కమలాకర్ సూచించారు. జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ జాగృక్ దివస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరం జరిగిన వెంటనే టోల్ ఫ్రీ నెంబరు 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలకు పాల్పడే వారంతా బహుమతులు గెలుచుకున్నారంటూ ఫోన్ చేసి ఖాతాల వివరాలు తెలుసుకుని, డబ్బులు కాజేస్తారని వివరించారు. న్యూడ్ కాల్స్‌తో భయపెట్టి డబ్బులు కాజేస్తారని, ఇలాంటి కాల్స్ వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. డిజిటల్ అరెస్టులు ఉండవని, బెట్టింగ్, గేమింగ్ యాప్స్‌లతో మోసాలు చేస్తారని వివరించారు. రోడ్డు నియమ, నిబంధనలు పాటించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య, జడ్చర్ల ఎస్ఐ చంద్రమోహన్, సైబర్ వారియర్స్ భీమప్ప, గోపాల్ పాల్గొన్నారు.